
సాక్షి సూర్యాపేట

సోమవారం । 25 । ఆగస్టు । 2025



అసలేం జరిగింది..!

జైకేసారంలోని ఎస్ఆర్ ల్యాబొరేటరీస్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- 8లో



ఆరుగురి అరెస్టు

నకిరేకల్ శివారులో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని నకిరేకల్ పోలీసులు అరెస్టు చేశారు.


- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	584.90 అడుగులు
ఇన్‌ఫ్లో	:	3,65,456 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	3,65,456 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,495 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,019 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	7,518 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు



సాగర సోయగం

నాగార్జునసాగర్ 26 క్రస్ట్‌గేట్ల నుంచి పాల నురగలా దిగువకు పరుగులు తీస్తున్న కృష్ణమ్మ



సాగర్ అందాలను ఫోన్‌లో బంధిస్తున్న మహిళ



సాగర్ జలాశయంలో లాంచీలో విహరిస్తున్న పర్యాటకులు

న్యూస్‌రీల్

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చేస్తే చర్యలు

సూర్యాపేటటౌన్ : విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చేసే విద్యార్థులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ నరసింహ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కళాశాల నుంచి బహిష్కరణకు గురవుతారని పేర్కొన్నారు. క్రిమినల్ కేసులు నమోదై వారి విద్య, ఉద్యోగ, భవిష్యత్తు అవకాశాలు కోల్పోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రతి ఉన్నత విద్యాసంస్థలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కొత్తగా చేరిన విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమాలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిరంతరంగా నిర్వహించాలని తెలిపారు. ర్యాగింగ్ ఘటనలు ఎదురైతే బాధితులు తక్షణమే ప్రిన్సిపాల్, కళాశాల యాజమాన్యం లేదా పోలీసులను సంప్రదించాలని కోరారు. ర్యాగింగ్ సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ర్యాగింగ్‌ను పూర్తిగా నిర్మూలించడానికి విద్యాసంస్థల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు కృషి చేయాలని కోరారు.

సూర్యక్షేత్రంలో పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని చాయా సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్ రావు, బాలమురళీకృష్ణ, బీరవోలు ఇంద్రారెడ్డి, రత్నం లక్ష్మాజి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సుల వేళల్లో మార్పు

అర్వపల్లి : సూర్యాపేట-జనగామ 365బీ జాతీయ రహదారిపై నడుస్తున్న ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సుల వేళల్లో ఆర్టీసీ అధికారులు మార్పులు చేశారు. ఉదయం 5గంటలకు సూర్యాపేట డిపో నుంచి మొదటి ఎలక్ట్రికల్ బస్సు మొదలవుతుంది. ఆతర్వాత ఉదయం 6.30, 7.30, 10.50, 11.50, మధ్యాహ్నం 12.50 గంటలకు బస్సులు బయలుదేరి అర్వపల్లి, తిరుమలగిరి, మోత్కూర్, భువనగిరి, ఉప్పల్‌ల మీదుగా హైదరాబాద్‌కు వెళ్తాయని ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ సైదులు తెలిపారు. ఇవే బస్సులు ప్రతి రోజు హైదరాబాద్‌లోని జేబీఎస్ నుంచి ఉదయం 5గంటలకు, 6.00, 7.00 గంటలకు, సాయంత్రం 3.15 గంటలకు, 4.30, 5.30 గంటలకు బయలుదేరి ఇదే రూట్లో తిరిగి సూర్యాపేట డిపోకు చేరుతాయని చెప్పారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం శ్రీసామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం జరిపించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు.

ఇన్‌స్పైర్ మనక్‌పై అనాసక్తి!

- ఇప్పటివరకు దరఖాస్తులు సమర్పించింది 126 మంది మాత్రమే
- గతనెల 1న ప్రక్రియ ప్రారంభం కాగా.. వచ్చేనెల 15న ముగియనున్న గడువు
- ఇప్పటికే మండల స్థాయిలో సీనియర్ సైన్స్ ఉపాధ్యాయులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు
- దరఖాస్తులు చేయించాలని ఆదేశాలు జారీ చేసినా కనిపించని ఫలితం



తిరుమలగిరి(తుంగతుర్తి): విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచే ప్రయోగాల వైపు మళ్లించి వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని శాస్త్ర, సాంకేతిక శాఖ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రతియేటా ఇన్‌స్పైర్ మనక్ పోటీలు నిర్వహిస్తోంది. దీనికి జిల్లాలో ఆశించిన మేరకు స్పందన రావడం లేదు. గతనెల 1వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. గతేడాది 676 దరఖాస్తులొస్తే ఈసారి ఇప్పటి వరకు 126 మాత్రమే వచ్చాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు సెప్టెంబరు 15వ తేదీ లోగా ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో నామినేట్ చేయడానికి అవకాశముంది.

ప్రత్యేక కమిటీలు ఏర్పాటు

ఇన్‌స్పైర్ మనక్‌కు సంబంధించి గత నెలలో అప్‌లోడ్ ఎలా చేయాలో సైన్స్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. దరఖాస్తు చేయించేందుకు మండల స్థాయిలో సీనియర్ సైన్స్ ఉపాధ్యాయులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. దరఖాస్తులు చేయించాలని ఆదేశాలు జారీ చేసినా ఆశించిన ఫలితం కనిపించడం లేదు.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా..

సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు సమర్పించేందుకు గడువు ఉంది. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని యాజమాన్యాల పరిధిలోని విద్యాలయాల్లో చదువుకునే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులు. ఉన్నత పాఠశాల నుంచి ఐదు, యూపీఎస్ నుంచి మూడు చొప్పున నామినేషన్లు స్వీకరిస్తారు. వన్ టైమ్ రిజిస్ట్రేషన్లో భాగంగా విద్యాలయాల వివరాలు పొందుపర్చాలి. జిల్లా విద్యాశాఖ నుంచి వాటికి ఆమోదం లభించిన తర్వాత ఈమెయిల్ ఐడీ, లింకు లభిస్తాయి. వాటి సాయంతో పాస్‌వర్డ్ నమోదు చేసుకోవాలి. అనంతరం ప్రాజెక్టు నమూనాకు సంబంధించి పూర్తి వివరాలు అప్ లోడ్ చేయాలి.

విద్యాసంస్థల వివరాలు ఇలా

ఉన్నత పాఠశాలలు:	184
ప్రాథమికోన్నత పాఠశాలలు :	84
జూనియర్ కళాశాలలు :	08

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎక్కువ మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు భావిశాస్త్రవేత్తలు ఎదగడానికి అవకాశం ఉంటుంది. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– దేవరాజ్, జిల్లా సైన్స్ అధికారి

పలు అంశాలపై ప్రాజెక్టులు..

డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వచ్ఛ భారత్, మేక్ ఇన్ ఇండియా, సమా జాభివృద్ధి-క్లీన్ ఇండియా తదితర అంశాలపై విద్యార్థులు ప్రాజెక్టులు రూపొందించాలి. జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికైన నమూనాను ప్రదర్శించడానికి రూ.10 వేలను ప్రోత్సాహకంగా విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు. జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఎంపికైతే వాటిని రాష్ట్రస్థాయికి పంపుతారు. అక్కడి నుంచి జాతీయస్థాయికి ఎంపికైన నమూనాల రూపకర్తలకు ప్రభుత్వం పేటెంట్ హక్కు కల్పిస్తుంది. జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులను మరింత మెరుగైన విధంగా తయారు చేయడానికి కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ మరో రూ.25 వేలు ఇస్తుంది. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్‌లో అభినందనలు, అతిథ్యంతోపాటు పేరొందిన శాస్త్రవేత్తలతో కలిసి పాల్గొనే అవకాశం కల్పిస్తారు. జపాన్ వరకు వెళ్లి నోబెల్ శాస్త్రవేత్తలను కలుసుకునే సువర్ణావకాశం లభిస్తుంది.

ఎస్ఎస్ఏ ఉద్యోగులపై పట్టింపేది?

- అయోమయంలో 500 మంది సర్వశిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు
- తక్కువ వేతనంతో కుటుంబాలను భారంగా నడుపుతున్నామని ఆవేదన
- విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్న ఉద్యోగులు



గతేడాది డిసెంబర్‌లో కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు (ఫైల్)

మునగాల: సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ)లో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 500మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల పరిస్థితి గందరగోళంగా మారింది. జిల్లావ్యాప్తంగా ఎస్ఎస్ఏలో 500మంది ఉద్యోగులను రెగ్యులర్ చేసి విద్యాశాఖలో విలీనం చేయాలనే డిమాండ్లను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గత 20ఏళ్లుగా అతి తక్కువ వేతనంతో విధులు నిర్వర్తిస్తూ కుటుంబాలను భారంగా నడుపుతూ మానసికంగా కుంగిపోతున్నారు. అకస్మాత్తుగా మృతిచెందిన కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం అందలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాకముందు తమ ప్రభుత్వం అధికారలోకి వస్తే టీ తాగే సమయంలోపే మిమ్ములను రెగ్యులర్ చేస్తామని ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఇచ్చిన హామీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. గతేడాది డిసెంబర్‌లో ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం కలెక్టరేట్ ముందు నెలరోజులపాటు ధర్నా కూడా నిర్వహించారు.

వెట్టిచాకిరీలో కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఎస్ఎస్ఏలో సీఆర్పీ, ఆర్ఈఆర్పీ, ఎల్‌డీఏ, ఎంఐసీ కోఆర్డినేటర్స్, పీటీఐ, కేజీబీవీ సిబ్బంది, కేర్ టేకర్స్, మెసెంజర్స్, ఎండీఈఎల్ విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిన సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ తమతో వెట్టిచాకిరీ చేయిస్తుందని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఆర్పీలతో పాఠ్య, నోట్‌బుక్స్ మోయించడం, రైస్ గోదాం నుంచి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద మూటలు మోయిస్తున్నారని వాపోతున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్లు

- విద్యాశాఖలో పనిచేస్తున్న ఎస్ఎస్ఏ సిబ్బందిని సర్పంచ్ ఎన్నికలకు ముందే రెగ్యులర్ చేయాలి.
- రెగ్యులర్ ఆలస్యమైతే మినిమం టైమ్‌స్కేల్ ఇవ్వాలి.
- ఎస్ఎస్ఏ సిబ్బందిని విద్యాశాఖలో విలీనం చేయాలి.
- సీఆర్పీలకు టీఏ, డీఏలు ఇవ్వాలి.
- కాంట్రాక్ట్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి.
- ఉద్యోగ విరమణ పొందిన కాంట్రాక్టు ఉద్యోగులకు రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.
- విధి నిర్వహణలో మృతిచెందిన ఉద్యోగులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి.
- సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి.
- గతేడాది సమ్మె కాలంలో ఉద్యోగులకు వేతనం చెల్లించాలి.

విద్యాశాఖలో విలీనం చేయాలి



సర్వశిక్షా అభియాన్‌లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సుమారు 500మంది కాంట్రాక్టు ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి. గతేడాది డిమాండ్ల సాధన కోసం నెల రోజులుగా సమ్మె చేపట్టిన కాలంలో వేతనాన్ని విడుదల చేయాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తక్షణమే అమలుచేయాలి.

– రాంపంగు వెంకటేశ్వర్లు , ఎస్ఎస్ఏ జిల్లా జేఏసీ అధ్యక్షుడు, మునగాల

‘నవోదయ’ పనులు త్వరగా పూర్తిచేయాలి

- ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి ఉత్తమ్

సూర్యాపేట, కోదాడ : కోదాడలో ఏర్పాటు చేయనున్న జవహర్ నవోదయ విద్యాలయం భవన నిర్మాణ పనులు సంవత్సరంలోపే పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. భవన నిర్మాణం, పురోగతిపై ఆదివారం హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందని, ఇప్పటికే టెండర్లు ఖరారైనట్లు పేర్కొన్నారు. నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానుండగా పనులు సంవత్సరం లోపు పూర్తి చేసేలా అధికారులు పని చేయాలని ఆదేశించారు. క్యాంపస్ వాతావరణం ఆకర్షణీయంగా ఉండాలని సూచించారు. ప్రాజెక్టు కోసం కేటాయించిన 19 ఎకరాల స్థలాన్ని విద్యా భవనాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్ల కోసం సమర్థవంతంగా ఉపయోగించాలన్నారు. ప్రతి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, ఎన్‌బీసీసీ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బేరా, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్‌బీసీసీ హైదరాబాద్ డీజీఎం అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

అందుబాటులో 2,600 మెట్రిక్ టన్నుల యూరియా

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : జిల్లాకు ఆదివారం మరో 1000 మెట్రిక్ టన్నుల యూరియా రాగా.. మొత్తం 2600 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చిన యూరియాను పీఏసీఎస్‌లు, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేశామని, 5600 లీటర్ల నానో యూరియాను అన్ని సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు పడుతున్నాయని, వర్షపు నీటిలో నైట్రోజన్ శాతం ఎక్కువగా ఉండడం వల్ల ఎకరానికి కొంత మోతాదులో యూరియా లభిస్తుందని, రానున్న 10 రోజులలో యూరియా వినియోగం తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులందరికీ యూరియా అందుబాటులో ఉంచడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుమతులు రద్దు చేయడం అప్రజాస్వామికం



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

సూర్యాపేట అర్బన్ : వరంగల్‌లో ఆదివాసీల హక్కుల వేదిక, ప్రజా సంఘాల వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు రద్దు చేయడం అప్రజా స్వామికమని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ భద్రయ్య, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో వరంగల్ లో జరిగే సభకు అనుమతులు రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో వెంకటయాదవ్, మాధవరెడ్డి, లింగయ్య, సత్యనారాయణ, నరసయ్య, నాగయ్య, పిడమర్తి భరత్, దేశోజు మధు పాల్గొన్నారు.

పట్టణాల్లో దోమల మోత

- ఐదు మున్సిపాలిటీల్లో వందరోజుల ప్రణాళిక తర్వాత కూడా పారిశుద్ధ్య నిర్వహణ అంతంతే
- ఫాగింగ్‌ను విస్మరించిన అధికారులు
- ప్రతి శుక్రవారం డ్రైడే గా నిర్వహించాలని ఆదేశాలున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు



స్నేహనగర్ కాలనీలో ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న మురుగు

సూర్యాపేట అర్బన్: జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో నిర్వహించిన వందరోజుల ప్రణాళిక తర్వాత కూడా పారిశుద్ధ్య నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. ఖాళీ స్థలాలు, లోతట్టు ప్రాంతాల్లో మురుగు నీరు నిలువ ఉండడంతో దోమల బెడదతో స్థానికులు నరకయాతన పడుతున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే గా నిర్వహించాలని ఆదేశాలున్నా పట్టణాల్లో పరిసరాల పరిశుభ్రతను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దోమలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

- సూర్యాపేట మున్సిపాలిటీలోని 48 వార్డుల్లో 1,53000 జనాభా ఉంది. అంతర్గత రహదారుల్లో ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు బురద పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమల బెడద ఎక్కువైంది. ఖాసీంపేట, దురాజ్‌పల్లి, పిల్లలమర్రి, ఇందిరమ్మ కాలనీ, అంజరాపురి కాలనీల్లోని ఖాళీ ప్లాట్లలో నీరు నిలవడంతో దోమలు స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. 15 రోజులకు ఒకసారి ఫాగింగ్ చేయాల్సి ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం మూడు యంత్రాలు 48 వార్డుల్లో ఫాగింగ్ చేయడానికి సరిపోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు.
- కోదాడ మున్సిపాలిటీలోని నయా నగర్, అనంతగిరి రోడ్డు, భవాని నగర్, షిరిడీ సాయి కాలనీ, శ్రీమన్నారాయణ కాలనీ, 41వ వార్డులోని ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిల్వ ఉండి దోమల వృద్ధి చెంది స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మున్సిపాలిటీలో నాలుగు ఫాగింగ్ మిషన్లు ఉన్నా ఒకటే పని చేస్తోంది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఒక్కసారి కూడా ఫాగింగ్ చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- తిరుమలగిరి మున్సిపాలిటీలో దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు. నాలుగు ఫాగింగ్ యంత్రాలు పనిచేస్తున్నా అధికారులు పట్టణంలో ఫాగింగ్ చేయడంలో ఆలస్యం వహిస్తున్నారని పేర్కొంటున్నారు.
- హుజూర్‌నగర్ మున్సిపాలిటీలోని అంబేద్కర్ కాలనీ, గోవిందాపురం, మట్టపల్లి బైపాస్ రోడ్డు, చెరువు కాలనీలో పలు చోట్ల ఖాళీ ప్లాట్లలో మురుగు నీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. హుజూర్‌నగర్‌లో రెండు ఫాగింగ్ మిషన్లు ఉన్నా సమయానికి ఫాగింగ్ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- వర్షం వచ్చినప్పుడు నేరేడుచర్ల మున్సిపాలిటీలోని ఎన్టీఆర్ నగర్, నర్సయ్య గూడెంలో వరద నీరు నిలిచి ఆయా ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెంది స్థానికుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నేరేడుచర్ల మున్సిపాలిటీలో రెండు ఫాగింగ్ యంత్రాలు ఉన్నా.. సరైన సమయంలో ఫాగింగ్ చేయడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

రాత్రి అయితే దోమలతో జాగారమే..



సూర్యాపేటలోని స్నేహనగర్ కాలనీలో ఖాళీ ప్లాట్లలో వర్షం నీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమలు చుట్టు పక్కల ఇళ్లలోని వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సాయంత్రం అయిందంటే చాలు దోమలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే కాలనీలో పలువురు జ్వరాలతో ఆస్పత్రుల్లో చేరారు.

– కనకటి రవి, స్నేహనగర్ కాలనీ

దోమల బెడదను నివారించాలి



వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమల బెడద అధికమైంది. ఇప్పటి వరకు కోదాడలో దోమల నివారణకు మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇళ్ల మధ్య మురుగునీరు నిలవడం ప్రధాన సమస్యగా ఉంది. ఫాగింగ్ చేసి దోమల బెడదను నివారించాలి.

– ఈదుల కృష్ణయ్య, కోదాడ

మురుగు నిలిచే ప్రాంతాలను గుర్తించాం



సూర్యాపేట పట్టణంలో మురుగు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను ఇప్పటికే గుర్తించాం. మురుగునీరు నిలిచే ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. – హనుమంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట

క్లుప్తంగా

నేడు, రేపు ఎన్జీ కాలేజీలో జాతీయ సదస్సు

రామగిరి (నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల(ఎన్జీ కాలేజీ)లో సోమవారం, మంగళవారం 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు జీవశాస్త్రాల పాత్ర' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, సదస్సు సంచాలకులు ఎం. అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ప్రారంభ సమావేశంలో ముఖ్యఅతిథిగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం ఆచార్యులు రామాచారి పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు సదస్సుకు హాజరుకావాలని కోరారు.

కెనడాలో యాదగిరీశుడి కల్యాణం



కెనడాలోని విండ్సర్ నగరంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: కెనడా దేశంలోని విండ్సర్ నగరంలో యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తెలంగాణ కెనడా అసోసియేషన్ ఆహ్వానంతో రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు విండ్సర్ నగరంలో సంప్రదాయ పద్ధతిలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఆలయ రిటైర్డ్ ప్రధానార్చకుడు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ అధికారి గజవెల్లి రఘు ఆధ్వర్యంలో జరిపించారు. ఈ వేడుకకు విండ్సర్ నగరం ఎంపీ అండ్ర డోవి, ఎంపీపీ అర్చెగిల్‌తో పాటు స్థానిక ఎన్ఆర్ఐలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యాదగిరీశుడి సేవలో అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ జనరల్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని తెలంగాణ రాష్ట్ర అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ జనరల్ రఘునందన్, కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఈఓ వెంకట్రావ్‌లు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూలను, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తులను దర్శించుకొని పూజలు నిర్వహించారు. వారికి అర్చకులు ముఖ మండపంలో వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ వెంకట్రావ్ లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు.

వ్యాపారంలో నష్టం రావడంతో ఆత్మహత్య

దేవరకొండ: వ్యాపారంలో నష్టం రావడంతో మనోవేదనకు గురై ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దేవరకొండ మండలం తాటికోల్ గ్రామంలో ఆదివారం జరిగింది. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాటికోల్ గ్రామానికి చెందిన నాయిని భాస్కర్(55) గ్రామంలో ఫర్టిలైజర్, కిరాణ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండేళ్లుగా భాస్కర్ నిర్వహిస్తున్న వ్యాపారంలో నష్టం రావడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం తెల్ల వారుజామున ఫర్టిలైజర్ దుకాణంలో ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

అసలేం జరిగింది..!



అగ్ని ప్రమాదం జరిగిన బ్లాక్‌ను పరిశీలిస్తున్న పరిశ్రమల ఇన్‌స్పెక్టర్ జంగయ్య తదితరులు



మంటల్లో కాలిపోయిన ద్వారకామయి ప్రొడక్షన్ బ్లాక్

- ఎస్ఆర్ ల్యాబొరేటరీస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు
- రియాక్టర్ లీకై ప్రమాదం జరిగిందని సమాచారం అందిందంటున్న అగ్నిమాపక అధికారులు
- షార్ట్ సర్క్యూటే కారణమంటున్న కంపెనీ సిబ్బంది
- మంటల వల్ల వెలువడిన రసాయనాలతో వాడిపోయిన పంట పొలాలు
- ఎస్ఆర్ ల్యాబొరేటరీస్‌ను సందర్శించిన ఉమ్మడి జిల్లా పరిశ్రమల ఇన్‌స్పెక్టర్
- పరిశ్రమలో పూర్తిస్థాయి ఫైర్ సేఫ్టీ లేదంటున్న జిల్లా అగ్నిమాపక అధికారి

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామ పరిధిలోని ఎస్ఆర్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అగ్ని ప్రమాదానికి ప్రాథమికంగా షార్ట్ సర్క్యూటే కారణమని చెప్పిన అధికారులు.. ఆదివారం మాత్రం రియాక్టర్ లీకై మంటలు వచ్చినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కంపెనీలోని ద్వారకామయి ప్రొడక్షన్ బ్లాక్‌లో వారం రోజుల క్రితం పాత రియాక్టర్‌ను తీసి దాని స్థానంలో కొత్తది బిగించినట్లు కార్మికులు చెబుతున్నారు. దీనితో పాటు మరో రియాక్టర్ మార్చాల్సి ఉండగా.. దానిని మార్చలేదు. మార్చని రియాక్టర్ నుంచే రసాయనాలు లీక్ కావడంతో మంటలు వచ్చినట్లు తెలుస్తోంది. మంటలు వచ్చిన సమయంలో ప్రొడక్షన్ ఇన్‌చార్జిగా ఉన్న మధుసూదన్‌చారి అక్కడ పనిచేస్తున్న ఆరుగురు కార్మికులను అప్రమత్తం చేయగా.. వారు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. మంటల దాటికి రియాక్టర్లకు ఉన్న దూది కోటింగ్ కాలిపోయింది. ఓ రియాక్టర్ కిందపడిపోయింది. సకాలంలో స్పందించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో రియాక్టర్లు పేలలేదు. లేదంటే ప్రమాదం తీవ్రత భారీగా ఉండేది. ఆదివారం ఉదయం ప్రమాదం జరిగిన ప్రొడక్షన్ బ్లాక్‌ను ఉమ్మడి జిల్లా పరిశ్రమల ఇన్‌స్పెక్టర్ ఎస్. జంగయ్య సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

ప్రమాదానికి కారణాన్ని అంచనా వేయలేకపోతున్నాం..

ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఇప్పటికిప్పుడే అంచనా వేయలేకపోతున్నామని పరిశ్రమల ఇన్‌స్పెక్టర్ ఎస్. జంగయ్య తెలిపారు. పరిశ్రమ అధికారులు మాత్రం షార్ట్ సర్క్యూట్ అని చెబుతున్నా.. అలాంటి ఆనవాళ్లు కనిపించడం లేదని ఆయన అన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు నుంచి నివేదిక వచ్చిన తర్వాత నిర్ధారణకు వస్తామని పేర్కొన్నారు.

జరిగిన ఘటనపై వివరాలు తెలుసుకునేందుకు ప్రొడక్షన్ ఇన్‌చార్జిగా ఉన్న మధుసూదన్‌చారిని ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

పూర్తిస్థాయి ఫైర్ సేఫ్టీ లేదు..

శనివారం రాత్రి ఎస్ఆర్ ల్యాబొరేటరీస్‌లో రియాక్టర్‌లోని రసాయనాలు లీకై చిన్నగా మంటలు వస్తున్నాయని సమాచారం రావడంతో చౌటుప్పల్ నుంచి అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేసినట్లు జిల్లా అగ్నిమాపక అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో ఫైర్ సేఫ్టీ పూర్తిస్థాయిలో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని గతంలోనే యాజమాన్యాలకు సూచించామని, కానీ ఎస్ఆర్ ల్యాబొరేటరీస్‌లో ఇంతవరకు పూర్తిస్థాయి ఫైర్ సేఫ్టీ ఏర్పాటు చేసుకోలేదని ఆయన పేర్కొన్నారు. సరైన ఫైర్ సేఫ్టీ లేక ఫైరింజన్‌తో పాటు దివీస్ పరిశ్రమ నుంచి మంటలను అదుపుచేసే రసాయనాలను తీసుకొచ్చి త్వరగా మంటలను అదుపు చేయగలిగినట్లు ఆయన తెలిపారు.

వాడిపోయిన పంట పొలాలు..

మంటల ధాటికి రియాక్టర్లలోని రసాయనాలు ఎగిసిపడడంతో పరిశ్రమ చుట్టుపక్కల గల జైకేసారం గ్రామానికి చెందిన పలువురు రైతులు వరి, జొన్న పంటలు వాడిపోయాయి. దీంతో పాటు రామన్నపేట వెళ్లే రోడ్డుపై కెమికల్ పడి విపరీతమైన దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని పంట నష్టపోయిన రైతులు పరిశ్రమ యాజమాన్యాన్ని కోరినట్లు సమాచారం.



రసాయనాల ధాటికి వాడిపోయిన పంట చేలు

కాటేపల్లిలో టైర్ల కంపెనీ తొలగించే వరకు పోరాటం



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

- హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: ప్రపంచంలో అత్యంత వేగంగా కాలుష్యం పెరుగుతున్న దేశం భారతదేశమని, ఇప్పటికే ఢిల్లీ నాశనమైందని, కాలుష్యం వచ్చే పరిశ్రమలకు పాలకులు అనుమతులు ఇస్తూ హైదరాబాద్‌ను ఏం చేద్దామనుకుంటున్నారో అర్థం కావడం లేదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని కాటేపల్లిలోని టైర్ల కంపెనీల కాలుష్యంపై అఖిలపక్ష సమావేశం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు డాక్టర్ పృథ్విరాజ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఒకప్పుడు సమాజం కోసం దేశంకోసం పాటుపడే వారు, త్యాగాలు చేసే వారు నాయకులుగా ఉండే వారని, కానీ ఇప్పుడు సంపాదనే ధ్యేయంగా రాజకీయాల్లోకి వస్తూ, రాజకీయాన్ని వ్యాపారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులకు ఏదైనా తెలియనప్పుడు సమాజంలో నిస్వార్థంగా ఆలోచించే మేధావులు ఎంతో మంది ఉన్నారని, వారి సలహాల ప్రకారం చేయాలి కానీ వారి సలహాలు తీసుకోవడం ఇష్టం ఉండదన్నారు. ప్రపంచంలో అన్ని దేశాలు కాలుష్యం వచ్చే పరిశ్రమలు మాకు వద్దు అంటుంటే ఆ సంస్థలను భారత్‌కు ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానిస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాటేపల్లి గ్రామం మొత్తం ఐక్యం కావాలని, వారికి తాము అండగా ఉంటామని ప్రజా ఉద్యమం చేస్తేనే ప్రభుత్వం దిగి వస్తుందన్నారు. ప్రొఫెసర్ బాబూరావు మాట్లాడుతూ.. కాటేపల్లి పారిశ్రామిక ప్రాంతం కాదని, కానీ అక్కడ టైర్ల కంపెనీకి అనుమతులు ఇచ్చారంటేనే మన కాలుష్య నియంత్రణ మండలి ఎలా పనిచేస్తుందో అర్థం అవుతుందన్నారు. సదరు కంపెనీ ముందు బోర్డు కూడా లేదని, ఇటీవల సియాచీన్ కంపెనీలో 50 మంది చనిపోయారని, ఏదైనా ప్రమాదం జరిగితే గానీ పట్టించుకోరా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తుల ఉమ మాట్లాడుతూ.. కాటేపల్లి గ్రామంలో వ్యవసాయ భూముల మధ్య ఊరికి దగ్గరగా రెండు టైర్ల రీసైక్లింగ్ కంపెనీలకు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. దాని యజమాని మార్వాడీ, కానీ మన వారిని కొంతమందిని పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాడని అన్నారు. సమావేశంలో విఠల్, రఘు, సుభాష్, జలంధర్, శ్రీనివాస్, వెంకట్, అరుణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అట్టపెట్టెల మాటున మూగజీవాల రవాణా

- పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్న పోలీసులు



పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్న వాహనంలో మూగజీవాలు

చౌటుప్పల్ రూరల్: అట్టపెట్టెల మాటున మూగజీవాలను అక్రమంగా రవాణా చేస్తుండగా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. చౌటుప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సంత నుంచి 12 ఆవు దూడలు, 21 ఎద్దు దూడలను కొనుగోలు చేసి గూడ్స్ వాహనంలో హైదరాబాద్‌లోని బహదూర్‌పురా కబేళాకు తరలిస్తుండగా.. పక్కా సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొత్తపల్లికి చెందిన ఆటో డ్రైవర్ పెద్దపూడి అప్పలకుమారస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఐదు ఎద్దులు.. నాలుగు ఆవులు

చౌటుప్పల్: కోదాడ సంతలో కొనుగోలు చేసిన ఐదు ఎద్దులు, నాలుగు ఆవులను గూడ్స్ ఆటోలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. కోదాడ ప్రాంతంలోని జగన్‌నాయక్ తండాకు చెందిన వాహనం డ్రైవర్ బానోతు సురేందర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ మన్మథకుమార్ తెలిపారు.

వాహనం సీజ్..

వలిగొండ: అక్రమంగా 14 గోవులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు సీజ్ చేసి గోవులను గోశాలకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అనకాపల్లి జిల్లాకు చెందిన జోగ శివాజీ శ్రీకాకుళం మార్కెట్ యార్డులో 14 గోవులను కొనుగోలు చేసి అక్రమంగా అశోక్ లేలాండ్ వాహనంలో హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. వలిగొండ మండల కేంద్రంలోని తొర్రూరు చౌరస్తా వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వాహనం సీజ్ చేసి గోవులను రాజాపేట మండలంలోని గోశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు

- 1.290 కిలో గంజాయి, 7 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నకిరేకల్ సీఐ వెంకటేష్

నకిరేకల్: గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్న ఆరుగురిని నకిరేకల్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం నకిరేకల్ సీఐ వెంకటేష్ విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణ శివారులోని తాటికల్ రోడ్డులో కుమ్మరిబావి దగ్గరలోని చెట్ల పొదల్లో శనివారం మధ్యాహ్నం కొందరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక పోలీసులు దాడులు చేశారు. అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న, కొనుగోలు చేసి సేవిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ గంజాయి దందాలో మొత్తం ఎనిమిది ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారి నుంచి రూ.32,500 విలువ చేసే 1.290 కిలోల గంజాయి, 7 సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఆరుగురిలో నకిరేకల్‌లోని తాటికల్ రోడ్డు వాసి యన్నమల్ల సాయిరాం, నల్లగొండలోని ఎన్జీఓస్ కాలనీకి చెందిన బోరిగం సంపత్‌కుమార్, నకిరేకల్‌లోని ఎస్ఎల్‌బీసీ కాలనీకి చెందిన ముక్కాముల అఖిల్, నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన పల్లె బోయిన శివ, శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన బండారి వినయ్, సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం కోమటికుంటకు చెందిన కుంచం నవీన్‌తో పాటు ఓ బాల నేరస్తుడు ఉన్నారు. నల్లగొండకు చెందిన సమీర్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. వీరంతా కలిసి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో ఈ కేసు విచారణ చేస్తున్నామని సీఐ వెల్లడించారు. స్థానిక ఎస్ఐలు లచ్చిరెడ్డి, క్రిష్ణాచారి, పోలీస్ సిబ్బంది వై. వెంకటేశ్వర్లు, కె. జనార్దన్, బి. మధుకర్, వి. సురేష్, డి. శ్రీకాంత్, ఎం. నాగర్జున్‌ను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించినట్లు తెలిపారు.

మోత్కూరు తహసీల్దార్ కార్యాలయంలో వసూల్ రాజా

- రికార్డు అసిస్టెంట్ డబ్బులు డిమాండ్ చేశాడని దరఖాస్తుదారుల ఆరోపణ

మోత్కూరు: మోత్కూరు తహసీల్దార్ కార్యాలయంలో భూమి పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే రికార్డు అసిస్టెంట్ డబ్బులు డిమాండ్ చేశాడని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండల కేంద్రానికి చెందిన వ్యాపారి బాసోజు అంజయ్యచారి స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. బ్యాంకు అధికారులు సంబంధిత పత్రాలను పరిశీలించి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్ఓఆర్ కాపీ తీసుకు రావాలని అంజయ్యచారికి సూచించారు. దీంతో అతడు వారం క్రితం మోత్కూరు తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డ్ సెక్షన్‌లో ఆర్ఓఆర్ కాపీ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అదేవిధంగా మోత్కూరు మండల రాగిబావి గ్రామంలో మెండు రాధమ్మకు సంబంధించిన భూమి సర్వే నంబర్ తప్పుగా పడటంతో దానికి సంబంధించిన రికార్డు నకలు పత్రాలను ఇవ్వాలని ఆమె మనవరాలు భర్త శ్రీనివాస్‌రెడ్డి వారం క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. వీరిద్దరు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రికార్డు అసిస్టెంట్ చరణ్‌ను పత్రాలు ఇవ్వాలని అడడగా.. రూ.500 చొప్పున లంచం డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని అనడంతో రూ.300కు బేరం కుదుర్చుకున్నాడు. కొంత సమయం డిప్యూటీ తహసీల్దార్ సంతకాలు చేయలేదని, మరుసటి రోజు రమ్మని చరణ్ దరఖాస్తుదారులకు సూచించాడు. దీంతో శనివారం మళ్లీ వెళ్లి రికార్డు అసిస్టెంట్ చరణ్‌ను పత్రాలు అడగగా డిప్యూటీ తహసీల్దార్‌కు రూ.2వేలు, రికార్డులు వెతికినందుకు తనకు రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంత ఇవ్వలేమని బతిమిలాడగా చివరకు తనకు రూ.500, డిప్యూటీ తహసీల్దార్‌కు రూ.1000 ఇవ్వాలని బేరం కుదుర్చుకున్నాడు. తమ నుంచి ఫోన్ పే చేయించుకుని స్క్రీన్ షాట్ చూపిన అనంతరం తమకు సంబంధించిన పత్రాలు ఇచ్చాడని దరఖాస్తుదారులు వాపోయారు. ఇదే విషయమై తహసీల్దార్ జ్యోతిని వివరణ కోరగా.. ఈ విషయమై విచారణ జరిపి రికార్డు అసిస్టెంట్ చరణ్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చికిత్స పొందుతూ మృతి

చిట్యాల: విష పురుగు కరవడంతో అస్వస్థతకు గురైన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం తాళ్లవెల్లెంల గ్రామానికి చెందిన షేక్ షాహిన్(39) తన ఇంట్లో నిద్రిస్తుండగా శనివారం తెల్లవారుజామున ఆమె ఎడమకాలిపై గుర్తుతెలియని విష పురుగు కాటు వేసింది. దీంతో ఆమె అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి భర్త సలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

పురుగు మందు తాగి..

వలిగొండ: పొరపాటున పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఎస్ఐ యుగంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం దుప్పెల్లికి చెందిన నారబోయిన ఉప్పలయ్య(56) అదే గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో శనివారం ఉదయం పురుగుల మందు పిచికారీ చేశాడు. అనంతరం అతడు పొరపాటున మంచినీళ్లు అనుకుని పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. అతడిని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

- ఒకరికి తీవ్ర గాయాలు

డిండి: రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం డిండి మండల పరిధిలోని ఎర్రగుంటపల్లిలో జరిగింది. ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన కదారి నారయ్యకు ఇద్దరు కుమారులు వెంకటయ్య, పెద్దయ్య సంతానం. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన నాలుగెకరాల పొలం అన్నదమ్ములు ఇద్దరి పేర్ల మీద కలిపి రిజిస్ట్రేషన్ అయ్యింది. భూమి భాగాలు మార్పిడి చేయాలని మూడేళ్ల నుంచి అన్నదమ్ముల మధ్య పంచాయితీ కొనసాగుతోంది. శనివారం సాయంత్రం పెద్దయ్య పొలం వద్ద పని చేసుకుంటుండగా.. వెంకటయ్య, అతడి కుమారుడు శివ వచ్చి భూమి భాగాలు పంచే వరకు పొలం పనులు ఆపాలని అన్నారు. ఈ క్రమంలో మాటా మాట పెరిగి ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో పెద్దయ్య తలకు గాయాలు కాగా.. కుటుంబ సభ్యులు దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరువురు అన్నదమ్ములు ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

కనువిందు చేస్తున్న రాచకొండ వాటర్ ఫాల్స్



రాచకొండ గుట్టల్లో నుంచి జాలువారుతున్న నీరు



వాటర్ ఫాల్ వద్ద యువకుల సందడి

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయపురం మండల పరిధిలోని రాచకొండ అటవీ ప్రాంతంలో పల్లగట్టుతండా, గంగమూలతండా పరిధిలో వాటర్ ఫాల్స్ పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసన వర్షాలకు రాచకొండ గుట్టల్లో నుంచి జాలువారుతున్న నీరు మల్కాచెర్వు, గంగకుంటలోకి వస్తున్నాయి. గుట్టలు, చెట్ల మధ్యలో నుంచి జాలువారే నీటిని చూసేందుకు ఆదివారం పెద్దఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. యువకులు నీటిలో ఈత కొడుతూ ఆనందంగా గడిపారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు పర్యాటకులను హెచ్చరిస్తూ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.2లక్షల నగదు అపహరణ

కోదాడరూరల్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని శ్రీమన్నారాయణ కాలనీలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీమన్నారాయణ కాలనీ ఎల్ఐసీ ఆఫీస్ వీధిలో నివాసముంటున్న చిన్నపిల్లల వైద్యుడు చింతలపాటి శ్రావణ్‌కుమార్ కోదాడ పట్టణంలో ఆస్పత్రి నిర్వహిస్తున్నాడు. శనివారం హాస్పిటల్‌లో పని ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో రాత్రి శ్రావణ్‌కుమార్ అక్కడే ఉండిపోగా.. అతడి భార్య పిల్లలను తీసుకుని సూర్యాపేటలోని ఆమె పుట్టింటికి వెళ్లింది. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వారి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 12 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.2లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చిన డాక్టర్ శ్రావణ్‌కుమార్ తాళం పగులగొట్టి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సీఐ శివశంకర్ ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నల్లగొండ: నల్లగొండలోని మిర్యాలగూడ రోడ్డులో మార్బుల్ షాపు వద్ద ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి (సుమారు 60 ఏళ్లు) మృతదేహం లభ్యమైనట్లు నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మృతుడు నలుపు రంగు చొక్కా, గళ్ల లుంగీ ధరించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 70141 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

జనసంద్రంగా మారిన సాగర్

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తుండటంతో.. సాగర్ అందాలను చూసేందుకు ఆదివారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో బుద్ధవనం, సాగర్ డ్యాం, విద్యుదుత్పాదన కేంద్రం, కొత్త బ్రిడ్జి, విజయ విహార్, లాంచీ స్టేషన్‌తో పాటు హోటళ్లు, లాడ్జీలు పర్యాటకులతో కిటకిటలాడాయి. నదీ తీరం వెంట, బుద్ధవనం పరిసరాల్లో, పార్కుల్లో పర్యాటకులు సహపంక్తి భోజనాలు చేస్తూ ఆనందంగా గడిపారు. సాగర్ సమీపంలోని ఎత్తిపోతల వద్ద కూడా పర్యాటకులు సందడి చేశారు.

ట్రాఫిక్ జాం..

సాగర్ డ్యాం దిగువన గల శివాలయం ఘాట్ నుంచి డౌన్ పార్కు ముత్యాలమ్మ గుడి వరకు.. అటు కొత్త బ్రిడ్జి నుంచి మాచర్ల రోడ్డు వరకు పర్యాటకులు తమ వాహనాలను రోడ్ల పైనే పెట్టడంతో ట్రాఫిక్ జాం అయ్యింది. దీంతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు అప్రమత్తమై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



నాగార్జునసాగర్‌లో జల విద్యుదుత్పాదక కేంద్రం వద్ద ట్రాఫిక్ జాం



సాగర్ అందాలను వీక్షించేందుకు వచ్చిన పర్యాటకులు



లాంచీ స్టేషన్ వద్ద బారులుదీరిన వాహనాలు



చెట్ల కింద కూర్చొని భోజనాలు చేస్తున్న పర్యాటకులు